క్లుప్తంగా

నేడు ఈపురుపాలెం పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం రైల్వేస్టేషన్ వద్ద వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి వార్షిక తిరునాళ్లను మంగళవారం వైభవంగా నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రటనలో తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకుని దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు, మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశామన్నారు. ఉదయం అమ్మవారికి పొంగళి నైవేద్యాలకు గ్రామోత్సవం చేస్తున్నామన్నారు. తిరునాళ్లకు అధికసంఖ్యలో ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కమిటీ ప్రతినిధులు సూచించారు.

హెపటైటిస్‌పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

అద్దంకి రూరల్: హెపటైటిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక కేఆర్కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వీ మోహన్‌రావు అన్నారు. సోమవారం ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వ్యాధి వల్ల ప్రతి ఏడాది ప్రపంచ దేశాల్లో సుమారు 1.3 మిలియన్ల మరణాలు సంభవిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు చెక్



అండిపూడిలో రోగులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

బల్లికురవ: పలు జాగ్రత్తలు, సురక్షిత మంచి నీరు, పరిశుభ్రతతో ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని మార్టూరు సీహెచ్‌సీ జనరల్ ఫిజిషియన్ సాయిప్రసాద్ అన్నారు. సోమవారం పెదఅంబడిపూడి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో సీజనల్ జ్వరాలకు చెక్ పెట్టేందుకు డీఎంహెచ్‌వో ఆదేశాలతో ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. 51 మంది రోగులు శిబిరానికి రాగా వీరిలో 12 మందిరక్త నమూనాలను సేకరించారు. ఈశిబిరంలో గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా విద్యార్థులు గ్రామస్తులకు అవగాహన కల్పించాలి డెంగీ నివారణే ఉత్తమ రక్షణ అన్నారు. చేతులు, పరిసరాల పరిశుభ్రతతో ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు కోరారు.

గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత



ఇన్వర్టర్ అందజేస్తున్న క్యూబ్ హైవేస్ సంస్థ ప్రతినిధులు

అద్దంకి రూరల్: పాఠశాలల మౌలిక వసతుల కల్పనలో భాగంగా క్యూబ్ హైవేస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ హైవే పక్కన ఉన్న పాఠశాలకు మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పీ. దుర్గా గాయత్రి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుచి, శుచితో మంచి ఆహారం అందించాలి

కొడవలివారిపాలెం (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లో మంచి రుచి, శుచి గల ఆహారాన్ని అందించేలా కుంకింగ్ నిర్వాహకులు శ్రద్ధగా పనిచేయాలని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కుంకలమర్రు ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో బోధనా విధానాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా టీఎల్‌ఎంల సహకారంతో బోధించాలన్నారు. అనంతరం కొడాలి బోస్ దంపతులు, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఆయన విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, స్కూల్ పీసీ చైర్మన్ రాధ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



దాతలను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఆ పల్లెలు అభివృద్ధికి దూరం !

- హైకోర్టులో కేసులు వేసిన టీడీపీ నేతలు
- ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని దుస్థితి
- నియోజకవర్గంలో 23 పంచాయతీలకు ఐదేళ్లుగా ఎన్నికలు లేవు
- ఒక్క రూపాయి కూడా అందని 15వ ఆర్థిక సంఘం నిధులు
- పంచాయతీ సాధారణ నిధులతోనే నెట్టుకొస్తున్న వైనం



వేటపాలెం గ్రామ పంచాయతీ వ్యూ

చీరాల/వేటపాలెం: వాళ్లకు నచ్చని చోట ఎక్కడ అభివృద్ధి చెందుతుందేమోనని.. పేరు మొత్తం వాళ్లు ఎక్కడ కొట్టేస్తారేమోనని భయం ఉంటే చాలు అక్కడ తెలుగుదేశం పార్టీ నాయకులు దూరిపోతారు. అమాంతం మధ్యలో దూరి లేనిపోనివి సృష్టించి కోర్టుల్లో కేసులు వేసి తమ పైశాచిక ఆనందం పొందుతుంటారు. ఇది వారికి వెన్నుతో పెట్టిన విద్య. గ్రామాల అభివృద్ధిని వాళ్లు చేయరు.. ఇతరులు చేస్తుంటే మాత్రం ఓర్చుకోరు. ఆపల్లెలు ఏం పాపం చేసుకున్నాయో గడిచిన ఐదేళ్లుగా అంధకారంలో చిక్కుకున్నాయి. కనీస మౌలిక వసతులకు నోచుకోలేదు. తాగునీరు మచ్చుకైనా అందదు, చీకటి పడితే గ్రామాలన్నీ అంధకారంలో ఉంటాయి. తెల్లవారితే గ్రామాలు మురికివాడలుగా దర్శనమిస్తాయి. కనీసం వర్షాకాలంలో బ్లీచింగ్, క్లోరిన్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు కూడా డబ్బులు ఉండవు. ఇదంతా ఆధిపత్యం కోసం తెలుగుదేశం నాయకులు చేసిన ఘనకార్యం. రాష్ట్రం మొత్తం ఒక ఎత్తైతే చీరాలలో నియోజవర్గం మాత్రం మరో ఎత్తు. చీరాల రూరల్ మండల పరిధిలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా వాటికి అనుగుణంగా 20 ల్యామినేట్ గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఈపురుపాలెం, గవినివారిపాలెం, ఓడరేవు, దేవాంగపురి వంటి మేజర్ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల పరిధిలో ఒక్కో గ్రామం పరిధిలో రూ.15 వేలకు పైగా జనాభా కలిగి ఉంటారు. వేటపాలెం మండల పరిధిలో మొత్తం తొమ్మిది గ్రామ పంచాయతీలు ఉండగా ప్రధానంగా వేటపాలెం, దేశాయిపేట, కొత్తపేట, వంటి మేజర్ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 16 ల్యామినేట్ గ్రామాలు ఉన్నాయి. ఈపంచాయతీల పరిధిలో కూడా 10 నుంచి 15 వేల వరకు జనాభా ఉంటారు. నియోజకవర్గ పరిధిలో దాదాపు అన్ని గ్రామాలు ఒకదానికి ఒకటి కలిసిపోయి ఉంటాయి.

ఐదేళ్లుగా ఎన్నికలకు నోచుకోని పంచాయతీలు..

రాష్ట్ర వ్యాప్తంగా 2021 ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికల నిర్వహించారు. అయితే చీరాల నియోజవర్గ పరిధిలోని చీరాల రూరల్, వేటపాలెం మండలాల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల ఎన్నికలకు నోచుకోలేదు. అయితే వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీకీ మాత్రమే ఎన్నికలు జరిగాయి. అప్పటినుంచి ఇప్పటివరకు పంచాయతీలకు ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. చీరాల రూరల్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీల పునర్విభజన జరిగాయి. కొత్తగా రెండు గ్రామ పంచాయతీలకు ప్రతిపాదనలు పంపారు. అదే విధంగా వేటపాలెం మండలంలో ఉన్న తొమ్మిది గ్రామ పంచాయతీలను పునర్విభజన చేసి అదనంగా మరో మూడు పంచాయతీలకు ప్రతిపాదనలు సిద్ధంచేసి నోటిఫికేషన్ ఇచ్చారు. అప్పట్లో ఇది గిట్టని టీడీపీ నాయకులు పునర్విభజనపై హైకోర్టులో 2020లో కేసులు వేశారు. దీనితో గ్రామ పంచాయతీలకు జరగాల్సిన ఎన్నిలు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీలకు ఇంటిపన్నుల ద్వారా, వ్యాపార సంస్థల ద్వారా ప్రధానంగా ఆదాయవనరులు వస్తుంటాయి. వీటి ద్వారా వచ్చిన కొద్దిపాటి ఆదాయం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు, వీధి దీపాలు, స్టేషనరీ వంటి వాటి కొనుగోలుకు మాత్రమే సరిపోతుంటాయి. గ్రామాభివృద్ధికి ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదల చేసి పంచవర్ష ప్రణాళికల నిధుల ద్వారానే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతుంటాయి.

నిలిచిపోయిన ఆర్థిక సంఘం నిధులు..

నియోజకవర్గ పరిధిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. కేవలం 2020-21 సంవత్సరానికి మాత్రమే ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు విడుదల చేశారు. మిగిలిన నాలుగేళ్లల్లో ఒక్క రూపాయి కూడా 22 గ్రామ పంచాయతీలకు అందలేదు. పంచాయతీలకు రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో అభివృద్ధికి నోచుకోకుండా పోయాయి. 22 గ్రామ పంచాయతీలు దాదాపు రూ. 21 కోట్లు 15 అర్థిక సంఘ నిధులు కోల్పోయాయి. టీడీపీ నాయకులు చేసిన పనికి ఈపంచాయతీలు ఐదేళ్లుగా అభివృద్ధి కాకుండా నీరుగారిపోయాయి.

ఇప్పటికైనా కేసులు వాపసు తీసుకుంటారా..

ఐదేళ్లుగా ఎన్నికలకు నోచుకోకుండా ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. గ్రామ పంచాయతీలకు రాబోయే ఎన్నికల నాటికైనా కోర్టు కేసులు కొలిక్కివస్తాయా లేదా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నాయకులు చేసిన పనికి గ్రామాలు అభివృద్ధికి నోచుకోక అంధకారంలో ఉండిపోయాని ప్రజలు విమర్శిస్తున్నారు. హైకోర్టులో కేసులు వేసిన వారు ఇప్పటికైనా కేసులు వాపసు తీసుకుంటారా లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



కార్యాలయం లోపలికి వెళ్లే వీలులేకుండా పార్కింగ్ చేసిన ఎంపీడీవో

కారు ఇలా.. కార్యాలయంలోకి వెళ్లేదెలా ?

- ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్లేందుకు వీలు లేకుండా కార్ పార్కింగ్
- మెట్లముందే నిలుపుదల చేయడంతో ప్రజల ఇబ్బందులు

చీరాల టౌన్: అది చీరాల మండల పరిషత్ కార్యాలయం. నిత్యం వందలాది మంది మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రభుత్వ కార్యాలయం. కానీ ప్రస్తుతం ఆ కార్యాలయంలోకి వెళ్లాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కారణం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కారును దర్జాగా కార్యాలయం మెట్ల ముందు పార్కింగ్ చేయడమే. దీంతో కార్యాలయంలో వెళ్లేందుకు మెట్లు ఎక్కే వీలులేకపోవడంతో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపుపై వెళ్తున్నారు. చీరాల ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ ఉద్యోగులతో పాటుగా జాతీయ ఉపాధి హామీ పథకం విభాగం, డివిజినల్ పంచాయతీల అభివృద్ధి అధికారి కార్యాలయం ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల బదిలీల్లో చీరాల మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా భాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో కారును మాత్రం కార్యాలయంలోకి వెళ్లే మెట్ల ముందుగా నిలుపుదల చేయడంతో అటు ఉద్యోగులు, ఇటు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. బాధ్యతాయుతమైన మండల అధికారి తన కారును దర్జాగా కార్యాలయం ముందు పార్కింగ్ చేయడం ఎంతవరకు సబబు అని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలో పనిచేసిన ఎంపీడీవోలు ఎవరూ కూడా తమ సొంత వాహనాలను కార్యాలయం ముందు నిలుపుదల చేసే వారు కాదని, ప్రస్తుత ఎంపీడీవో మాత్రం కొన్నిరోజులుగా తన సొంత వాహనం ఇలా కార్యాలయం ముందు పార్కింగ్ చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇకనైనా అధికారి తమ సొంత వాహనాన్ని ఎంపీడీవో కార్యాలయం మెట్ల ముందు నిలుపుదల చేయకుండా ఉండాలని అటు ఉద్యోగులు ఇటు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు



నోటు పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో క్లబ్ సభ్యులు

చినగంజాం (పర్చూరు): పాఠశాల అభివృద్ధికి దాతల కృషి అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూర్ సెంట్రల్, పర్చూరు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కోటా శ్రీనివాసరావు తన కుమార్తె ఆశాలత ఎంబీబీఎస్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత అయిన సందర్భంగా, స్థానిక గరల్స్ హైస్కూల్‌లో గత పదో తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురిని ఎంపికచేసి ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. అంతేకాకుండా పాఠశాల ఉపాధ్యాయినులకు నగదు పురస్కారాలు అందజేశారు. విద్యార్థినులు భవిష్యత్‌లో ఉన్నతస్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పంబి సదానంద రెడ్డి, నాగభైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, మున్నంగి వెంకటసుబ్బయ్య, పాఠశాల కరస్పాండెంట్ కె. రమేష్, పూర్వపు హెచ్‌ఎం కే. పార్వతి, హెచ్‌ఎం అవని, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



చీరాలలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాల: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉందని, పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని నల్లగాంధీబొమ్మ సెంటర్ నుంచి కుందేరు వరకు, చిన్నరథం సెంటర్ నుంచి వాడరేవు రోడ్డు వరకు జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డ్రైనేజీల్లో ఉన్న సిల్టును, చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది చేత శుభ్రం చేయించారు. వర్షపునీరు, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. బ్లీచింగ్, యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టి దోమల నివారణకై ఫాగింగ్ చేయించాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు శానిటేషన్ సెక్రటరీలు ఉన్నారు.

స్పెషల్ డ్రైవ్‌గా పారిశుద్ధ్య కార్యక్రమాలు

బల్లికురవ: వర్షాల సీజన్ ఆరంభమైనందున అన్ని గ్రామ పంచాయతీల్లో స్పెషల్ డ్రైవ్‌గా నవంబర్ వరకు కొనసాగించాల్సిందేనని ఎంపీడీవో వై హనుమారెడ్డి, సర్పంచ్‌లు, సెక్రటరీలకు సోమవారం సూచించారు. సైడు కాల్వల్లో వ్యర్థాలు మురుగు నిల్వలతో సీజనల్ జ్వరాలు వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ముందస్తుగా గ్రామాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. బల్లికురవలోని పోలీసు స్టేషన్ వీధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులకు పరిశీలించారు. ఆయన వెంట సెక్రటరీ కెవీ అనిల్ కుమార్ ఉన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం



కుంకలమర్రులో పండ్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు



కొప్పరపాడులో భోజనం వడ్డిస్తున్న ఎంఈవో

- శిక్షా సప్తాహ్ -2020 కార్యక్రమం ముగింపు

అద్దంకి రూరల్/మేదరమెట్ల/బల్లికురవ: విద్యార్థి దశ నుంచే సరైన పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్ -2020 నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా అద్దంకి పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నతపాఠశాల (సత్రం బడి)లో సోమవారం శుభ్‌దిన్ భోజన్ సామాజిక దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి నాయకులు, ఉపాధ్యాయులు భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు గంగాధర్, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- ప్రతి విద్యార్థి ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని ఎంఈవో పున్నయ్య అన్నారు. తిథి భోజన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం కొరిశపాడు జగ్జీవన్ రావునగర్‌లోని మండల పరిషత్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దాత ధన్‌రాజుపల్లి అంజయ్య విద్యార్థులకు పోషకాహారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీ.విజయకుమార్, హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయురాలు ఏ.సుభాషిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

- బల్లికురవ కొప్పరపాడు మండలంలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయుడు పీ. బాలాజీ మనుమరాలి జన్మదిన సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఈవో 2 కె. రమేష్ అన్నారు. పాఠశాలలోని 450 మంది విద్యార్థులకు భోజనం అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పీ. శ్రీనివాసరావు, చిన్నారి తల్లిదండ్రులు పీ తిరు శ్రీనివాస్, నాగదివ్య, పీఎంసీ చైర్మన్ దమ్ము అంజయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దాతల సాయంతో విద్యార్థులకు పౌష్టికాహారం..

కుంకలమర్రు (కారంచేడు): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వంఅందించే ఆహార పదార్థాలు కాకుండా, మరింత పౌష్టికాహారాన్ని దాతల సహకారంతోను అందించేలా ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎంఈఓ-2 మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కుంకలమర్రు మొయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యార్థులకు దాతల సహకారంతో సమకూర్చిన పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పావులూరి శ్రీనివాసరావు, సువర్ణబాబులు పాల్గొన్నారు. చర్చి కాంపౌండ్ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ విష్ణు, ఆర్ శ్యామల, పీ నాగమణి, వీ బాబూరావులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: పేరాల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బీ సాల్మన్, చీరాల రూరల్ దేవాంగపురి పంచాయితీ పరిధిలో శంకరయ్య మండల ప్రాథమిక పాఠశాల శిక్ష సప్తాహ్ కార్యక్రమాల ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు స్వీట్లు, డ్రైఫ్రూట్స్, అరటి పండ్లు, భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.నీలిమ, కె.శివకుమారి, జి.ఉమాదేవి, ఎ.రత్న, మాణిక్య, జె.రజిని, ఎస్.లక్ష్మి, నాసిక శివాజీ , బొద్దు జయశ్రీ పాల్గొన్నారు.



అద్దంకిలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈవో, నాయకులు



కొరిశపాడు జగ్జీవన్‌రావునగర్‌లో పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో



పేరాల హైస్కూల్‌లో సహపంక్తి భోజనం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బైకు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

అద్దంకి రూరల్: బైకు అదుపుతప్పి ఒక వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి మండలంలోని చక్రాయపాలెం గ్రామం వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. పంగులూరు మండలం కొండమూరు గ్రామానికి చెందిన వల్లెపు రమేష్ అతనికు మారుడు బైకుమీద అద్దంకి వస్తున్నారు. ఈక్రమంలో మేదరమెట్ల-నార్కెట్ పల్లి నామ్ రహదారిపై నున్న మండలంలోని చక్రాయపాలెం గ్రామ సమీపంలోకి బ్రిడ్జి వద్దకు రాగానే బైకు అదుపుతప్పి బ్రిడ్జి పై నున్న డివైడర్‌కు ఢీకొట్టాడంతో రమేష్‌కు గాయాలయ్యాయి. అక్కడకు చేరుకున్న స్థానికులు 108 వాహనం ద్వారా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మరో ప్రమాదంలో అద్దంకి మండలం పోలవరానికి చెందిన కుంచాల అంకిరాజు అద్దంకికి బయలుదేరాడు. తిమ్మాయపాలెం గ్రామ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అంకిరాజుకు గాయాలయ్యాయి.

23 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

చీరాల టౌన్: వైద్యుల సూచనల, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటుగా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఈపూరుపాలెం పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవి సూచించారు. సోమవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గ్రామంలోని 23 మంది గర్భిణులకు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన శిక్షలు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్టీఏ రామకృష్ణారెడ్డి

చీరాల రూరల్: వాహనదారులు ఏమరుపాటుగా ఉంటే రెప్పపాటులో ప్రమాదాలు జరుగుతాయని వాహన తనిఖీ అధికారి రామకృష్ణారెడ్డి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులోని ఆర్టీవో కార్యాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆర్టీఏ పాల్గొని మాట్లాడుతూ నూతన వాహనాల చట్టాల ప్రకారం ప్రతి వాహనదారుడు విధిగా తలకు హెల్మెట్ పెట్టుకుని వాహనాలు నడపాలని సూచించారు. అలానే అతివేగంగా వాహనాలు నడపరాదని, ముగ్గురు కూర్చుని వాహనాలు నడపరాదన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. అన్నింటికంటే ముఖ్యంగా చిన్న పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వద్దని చెప్పారు. వారు ప్రమాదాలు చేసి ఇరుక్కుంటే పెద్దలు కూడా కేసులలో నిందుతులుగా కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుందన్నారు. సదస్సులో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు న్యాయవాది ఎ. పుల్లయ్య నాయుడు, న్యాయవాదులు ఎ. రామకృష్ణారెడ్డి, సీహెచ్ రామరావు బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జేకే ఈశ్వరిరెడ్డి, పీఎల్వీ మతిన్, ప్రజలు పాల్గొన్నారు.

విలేకరితో పాటు మరో ఇద్దరిపై దాడి

చీరాల: విలేకరితో పాటు మరో ఇద్దరిపై సోమవారం రాత్రి కఠారివారిపాలెం పెట్రోలు బంకు వద్ద యువకులు దాడి చేసి గాయపరిచారు. కఠారివారిపాలెం సమీపంలో ఆలా రిసార్ట్స్ మేనేజర్ చైతన్య, వేటపాలేనికి చెందిన అశోక్ అనే విలేకరి (సాక్షి కాదు), మరో వ్యక్తి ముగ్గురు కలిసి వేటపాలెం బైపాస్‌లో పెట్రోలు కొట్టించుకుంటున్నారు. ఈక్రమంలో కఠారివారిపాలేనికి చెందిన పది మంది ఎంతసేపు ఆయిల్ కొట్టించుకుంటావంటూ ఘర్షణ పడి దాడి చేశారు. ఈఘర్షణలో చైతన్యకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. గాయపడిన అశోక్, మరో వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ మేరకు అవుటు పోస్టు పోలీసులు క్షతగాత్రుడు వద్ద నుంచి వివరాలను నమోదు చేశారు.

మహిళా పోలీసు ఫిర్యాదుతో వ్యక్తిపై కేసు

కారంచేడు: ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్పీ ఆదేశాలతో కారంచేడు ఎస్సై కే సురేష్ ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఎస్సై సురేష్ వివరాల మేరకు.. ఈనెల 28వ తేదీన విధి నిర్వహణల్లో కుంకలమర్రులో ఉన్న కారంచేడు పోలీసుస్టేషన్ మహిళా కానిస్టేబుల్‌పై పర్చూరు మండల వీరన్నపాలేనికి చెందిన జూపూడి రాజేష్ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కారంచేడు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలిసిన ఎస్పీ మహిళా కానిస్టేబుల్‌పై అసభ్యంగా ప్రవర్తించిన రాజేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆదేశించారు. దీంతో సోమవారం కారంచేడు ఎస్సై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేశారు. అలాగే నిందితుడిని పర్చూరు కోర్టుకు హాజరుపర్చగా కోర్టు వారు 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. విధి నిర్వహణల్లో ఉండే మహిళా పోలీసు, మహిళా కానిస్టేబుళ్లపై ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించి వారి విధులకు ఆటంకం కలిగిస్తే వారిపై శాఖా పరమైన చర్యలు, రౌడీషీట్ కూడా ఓపెన్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



నోటుపుస్తకాలు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో సోమవారం చీరాల రూరల్ మండలం హస్తినాపురంలోని ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను ఉచితంగా అందించారు. గుర్రం మోహనరావు ఆర్థిక సహకారంతో రూ.5 వేలు విలువ చేసే నోటు పుస్తకాలను విద్యార్థులకు అందించారు. దాతల సహకారంతో అందించే పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చందలూరి బాలవెంకటేశ్వరరావు, నక్కల సురేష్‌బాబు, చుక్కా శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణమూర్తి, శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.